క్లుప్తంగా

వచ్చే నెలలో మోదకొండమ్మ ఉత్సవాలు

హుకుంపేట: మండల కేంద్రంలోని కొలువై ఉన్న మోదకొండమ్మ తల్లి ఉత్సవాలను ఈనెల 26,27,28 తేదిల్లో జరగాల్సి ఉండగా... ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జూన్ 16,17,18 తేదిల్లో నిర్వహిస్తామని సర్పంచ్ ఎస్.వెంకటపూర్ణిమ తెలిపారు. ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవాల తేదీలను ప్రకటించారు. వచ్చే నెలలో జరగనున్న అమ్మవారి ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని కోరారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పాంగి అనిల్ పాల్గొన్నారు.

సోమాలమ్మ జాతర జూన్‌కు వాయిదా


సోమాలమ్మ అమ్మవారు

అడ్డతీగల: గ్రామ ఇలవేల్పు సోమాలమ్మ దేవత జాతరను వాయిదా వేసినట్టు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో అమ్మవారి జాతర నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, కోడ్ అమలులో ఉన్నందున పోలీసు శాఖ ఉత్తర్వుల మేరకు జాతర జరిగే తేదీలను మార్పు చేశామన్నారు. దీని ప్రకారం అమ్మవారి జాతర జూన్ నెల 9, 10, 11 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. భక్తులు ఈ మార్పును గమనించగలరని కోరారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి


సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

పాడేరు: సీపీఎం నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి అప్పలనర్స మాట్లాడుతూ కమ్యూనిస్ట్ పార్టీ ప్రజాస్వామిక విలువలకు, సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం సుందరయ్య అన్నారు. పార్టీ మరింత బలోపేతానికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. మతాన్ని రాజకీయాలకు దుర్వినియోగం చేయడం పూర్తిగా నిషేధించాలన్నారు. నాయకులు దాస్, కామరాజు, వరహాలబాబు, మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం


అప్పలరాజుపేటలో కురుస్తున్న వర్షం

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి పరిసరాల్లో ఆదివారం మధ్యాహ్నం కుండపోతగా వర్షం పడింది. గంటన్నరకు పైగా ఎడతెరిపిలేకుండా కురిసిన వానకు గిరులు తరులు తడిసి ముద్దయ్యాయి. పిల్లకాలువల్లో వర్షపు నీరు ప్రవహించింది. విద్యుత్ సరఫరా, సమాచార వ్యవస్థ కుంటుపడింది. రోజంతా ఎండతీవ్రత, ఉక్కపోతతో తల్లడిల్లిన ప్రజానీకం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురవడంతో సేదతీరారు. భారీ వర్షం తగ్గినప్పటికీ రాత్రి వరకు చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. ఈ వర్షాలు ముందస్తు వ్యవసాయ పనులు చేపట్టేందుకు దోహద పడతాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చీరలు, రొట్టెలు పంపిణీ


గర్భిణులకు రొట్టెలు పంపిణీ చేస్తున్న నాయకులు

మారేడుమిల్లి: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అనంతబాబు జన్మదిన వేడుకల్లో భాగంగా ఆదివారం స్థానిక సోమిరెడ్డి పాలెంలోని వృద్ధులకు ప్రభుత్వ ఆసుపత్రిలోని గర్భిణులు, రోగులకు వైఎస్సార్‌సీపీ నాయకులు చీరలు, పాలు, రొట్టెలను పంపిణీ చేశారు. ఏఎంసీ డైరక్టర్ దూడ స్మిత్, కో–ఆప్షన్ సభ్యుడు గురుకు ధర్మరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ గొర్లె అనిల్ ప్రసాద్ (బాబీ), వైస్ సర్పంచ్ వీరబాబు, శ్రీనివాసు రెడ్డి, అజమ్, షెడ్రక్ పాల్గొన్నారు.

ప్రగతి సిరి.. అనంతగిరి


రహదారి లేక కాలినడకన గ్రామానికి వెళ్తున్న డెక్కాపురం వాసులు (నాడు)


డెక్కాపురం గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు నిర్మాణం (నేడు)

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో శివారు ప్రాంతాల్లోనూ అభివృద్ధి
- కోట్లాది రూపాయల నిధులు
- ప్రధాన సమస్యల పరిష్కారం
- ఆనందంలో గిరిజనులు

అనంతగిరి: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అనంతగిరి పంచాయతీ అభివృద్ధికి పట్టించుకోకపోవడంతో 14 గ్రామాల్లో గిరిజనులు సమస్యలతో సవాసం చేసేవారు.. చంద్రబాబు పాలనలో గ్రామాల్లో మౌలిక సదుపాయాల్లో ప్రధానంగా తాగునీరు, రోడ్లు, సీసీరోడ్లు, డ్రైనేజీ సమస్యలతో సతమతమయ్యేవారు.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రధాన సమస్యల పరిష్కారానికి మార్గం చూపింది. సంక్షేమం, అభివృద్ధికి అడుగులు వేయడంతో గిరి గ్రామాల్లో ఆనందం నెలకొంది. ప్రతి గ్రామానికి సంక్షేమ పథకాలతో పాటుగా అభివృద్ధి పనులు జరగడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

టీడీపీ ప్రభుత్వ హయాంలో సమస్యలు

- పెద్దూరు గ్రామ సమీపంలోని శారద గెడ్డపై వంతెన నిర్మాణం లేకపోవడంతో 14 గ్రామాల గిరిజనులు వర్షాలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.
- లక్ష్మీపురం నుంచి డెక్కాపురం రోడ్డు సమస్య పరిష్కారం చూపలేదు.
- పెద్దూరు నుంచి పాతకోట, తలారీపాడు గ్రామాలకు రోడ్డు సమస్య పరిష్కారం కాలేదు.
- గిరిజనులు పండించే అటవీ ఉత్పత్తులకు ఉంచేలా కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం చేపట్టలేదు.
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని వసతి గృహం, కళాశాల సమస్యలు పరిష్కారానికి కృషి చేయలేదు.
- ప్రతి గ్రామంలోని తాగునీటి సమస్య పరిష్కరించలేదు.
- మండల కేంద్ర వాసులకు శ్మశానవాటికకు స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో

మండల పరిషత్ నిధులు, ఎంపీపీ శెట్టి నీలవేణి చొరవతో ...

- వైఎస్సార్ కాలనీ నుంచి పెద్దూరు వరకు డ్రైనేజీ రూ. 15 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం
- మండల కేంద్రవాసులకు శ్మశానవాటికకు ఎకర స్థలం కేటాయింపు, శ్మాసన వాటికి అభివృద్ధికి రూ. 4 లక్షలతో ఫెన్సింగ్, బోరు, షెల్టర్ నిర్మాణం.
- అమలగుడ గ్రామానికి రూ.10 లక్షలతో రోడ్డు నిర్మాణం
- రేగంలోని రూ.2 లక్షలతో, లక్ష్మీపురంలోని రూ.3లక్షలతో తాగునీటి పథకాల ఏర్పాటు
- మొండిజామిగుడ గ్రామానికి రూ.2 లక్షలతో సీసీ రోడ్డు
- మండల కేంద్రం గ్రావిటీ పథకానికి రూ.5 లక్షలతో మరమ్మతు పనులు

పంచాయతీ నిధులు: సర్పంచ్ సోమేల రూతు చొరవతో...

- పెద్దూరు గ్రామానికి రూ.5 లక్షలతో తాగునీటి పథకం
- మద్దిగరువు రూ.2.50 లక్షలతో నుయ్యి నిర్మాణం
- మద్దిగరువు గ్రామంలోని ఇంటింటికీ కొళాయికి రూ.1.80 లక్షలు
- నందిగుమ్మి 2.30 లక్షలతో తాగునీటి పథకం
- జామిగుడ గ్రామంలోని రచ్చబండ రూ. 46 వేలతో నిర్మాణం
- తాటిగుడ గ్రామంలోని తాగునీటి పథకం చుట్టూ రూ.80వేలతో ప్లాట్‌ఫారం నిర్మాణం.
- రేగం గ్రామంలోని రూ. 1.20 లక్షలతో రచ్చబండ నిర్మాణం

అభివృద్ధి పనులు

- రూ. 42 లక్షలతో మండల పరిషత్ భవనం నిర్మాణం.. భవన నిర్మాణానికి మండల పరిషత్ నుంచి రూ.27 లక్షలు కేటాయించగా, కలెక్టర్ నిధులు రూ.15లక్షలు కేటాయించారు.
- రూ.45 లక్షలతో అనంతగిరి పీహెచ్‌సీ మరమ్మతులు పనులతో సుందరంగా తీర్చిదిద్దారు.
- లక్ష్మీపురం నుంచి డెక్కాపురం మీదుగా దొనిమోరి వరకు రూ.2.40కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి.
- ప్రభుత్వ జూనియర్ కళాశాల నాడు నేడు కింద రూ. 60లక్షలతో అభివృద్ధి... ఫర్నీచర్, మరుగుదొడ్లు, ఆర్వోప్లాంట్, తదితర వసతులు
- రూ.45 లక్షలతో సచివాలయ భవనం
- రూ.23 లక్షలతో నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రం
- మండల కేంద్రంలోని రూ.2కోట్లతో పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ నిర్మాణం జరుగుతుంది
- పెద్దూరు వంతెన నిర్మాణ పనులు పూర్తి కావడంతో 14గ్రామాలకు మేలు
- అటవీ ఉత్పత్తులను భద్రపరచుకునేందుకు రూ.15లక్షలతో కలెక్షన్ సెంటర్ నిర్మాణం
- మండల కేంద్రంలోని బాలికల–2 పాఠశాలలోని నాబార్డు నిధులతో రూ.1.57 కోట్లతో కిచెన్, డైనింగ్, అదనపు తరగతి నిర్మాణం దాదాపుగా పూర్తయ్యాయి.
- మొదటి విడత నాడు–నేడు ద్వారా రూ. 65 లక్షలతో గిరిజన సంక్షేమ బాలికల–1 పాఠశాలను అభివృద్ధి చేశారు.
- మొదటి విడత నాడు–నేడు ద్వారా రూ. 65 లక్షలతో గిరిజన సంక్షేమ బాలకల– 2 పాఠశాల అభివృద్ధి చేశారు.
- నాలుగేళ్ల క్రితం మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన ఏటీఎం


రూ.45 లక్షలతో నిర్మించిన సచివాలయం భవనం


మండల పరిషత్ భవనం


రూ.2 కోట్లతో నిర్మించిన పెద్దూరు వంతెన


అనంతగిరి పెద్దూరులోని సీసీ రోడ్డు

నాడు కనీస సౌకర్యాలు కరువు



మా గ్రామానికి గతంలోని వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదు. రవాణా సౌకర్యం లేక కాలినడకన వెళ్లే పరిస్థితి ఉండేది. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సేవలు అందేవి కావు.. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మెటల్‌రోడ్డు వేశారు. తాగునీటి ఇబ్బందులు తప్పాయి. సీసీరోడ్లు వేశారు. జగనన్నకు రుణపడి ఉంటాం.

– కన్నమ్మ, జామిగుడ గ్రామం

తాగునీటి ఇబ్బందులు తప్పాయి



టీడీపీ ప్రభుత్వ హయాంలో మా గ్రామానికి కనీస తాగునీటి సదుపాయం లేదు. నీళ్ల కోసం కిలోమీటర్ల దూరంలోని ఊటగెడ్డలను ఆశ్రయించాల్సి వచ్చేది. కలుషిత నీటి వినియోగంతో గ్రామస్తులు తరచూ రోగాల బారిన పడేవారు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎంతో మేలు జరిగింది. గ్రామాల్లో తాగునీటి పథకాలు నిర్మించారు. అనేక గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి ఇబ్బందులు తప్పాయి.

– నర్సింగరావు, పీహెచ్‌సీ కాలనీ అనంతగిరి

సమన్వయం పాటించాలి


పోలీస్‌స్టేషన్‌లో వివిధ పార్టీల నాయకులతో సమావేశమైన సీఐ సన్యాసినాయుడు

రాజవొమ్మంగి: జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ప్రజలు, నాయకులు సమన్వయం పాటించాలని రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు కోరారు. ఈ మేరకు ఆయన మండల స్థాయి ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, గ్రామ ప్రముఖులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సెక్షన్ 144 సీఆర్‌పీసీ అమలులో ఉందన్నారు. అదే విధంగా ఎన్నికల కోడ్ కూడా అమలులోనే ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి అల్లర్లు జరుగకుండా, గొడవలకు తావులేకుండా ప్రతి ఒక్కరు సమన్వయం పాటించాలని కోరారు. అదే విధంగా కౌంటింగ్ అనంతరం ఎటువంటి సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదన్నారు. హింసాత్మక సంఘటలను పురిగొల్పే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటు రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్‌ఐలు వెంకయ్య, రఘునాథరావు పాల్గొన్నారు.

ఎంపీటీసీ బాలకృష్ణ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ


ఎంపీటీసీ బాలకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు

ఎటపాక: ఇటీవల దారుణ హత్యకు గురైన కన్నాయిగూడెం ఎంపీటీసీ సభ్యుడు వర్సా బాలకృష్ణ కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ అనంతబాబు ఆదివారం పరామర్శించారు. ఎంపీటీసీ స్వగ్రామం మారేడుబాక వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలకృష్ణ కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు.
కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీ అభివృద్ధికి ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎంపీటీసీ బాలకృష్ణను దారుణంగా హత్య చేయటం బాధాకరమన్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ సభ్యురాలు ఉబ్బా సుస్మిత, ఎంపీపీ కాక కామేశ్వరి, సచివాలయాల మండల కన్వీనర్ గోసు ప్రశాంత్, సొసైటీ చైర్మన్ పసుపులేటి లక్ష్మణరావు, పార్టీ మండల కన్వీనర్ తానికొండ వాసు, ఉపాధ్యక్షుడు ఆకుల వెంకటరామారావు, చింతూరు, కూనవరం, వీఆర్ పురం మండలాల జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు , పార్టీ మండల, సచివాలయాల కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

వేడుకగా సత్యనారాయణస్వామి వార్షిక కల్యాణం


ప్రత్యేకాలంకరణలో సత్యనారాయణస్వామి


కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి: స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద దేవదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో సత్యనారాయణస్వామి వార్షిక కల్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు విద్యాసాగర్ నేతృత్వంలో 12 మంది ఉభయదాతల చేతుల మీదుగా స్వామివారి కల్యాణాన్ని జరిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ ఈవో కీర్తి ఆదినారాయణ ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. సాయంత్రం మహిళలతో కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్సీ పూజలు

రంపచోడవరం: ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(అనంతబాబు) జన్మదినం సందర్భంగా రంపచోడవరం సాయిబాబా ఆలయంలో ఆయన ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు ఎమ్మెల్సీ అనంతబాబుని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ మంగా బొజ్జయ్య, వడగల ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు వంశీ కుంజం, సొసైటీ అధ్యక్షుడు జల్లేపల్లి రామన్నదొర, అన్నవరం డైరెక్టర్ కారుకోడి పూజ, పండా రామకృష్ణదొర తదితరులున్నారు.

150 మందికి వైద్య పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్

రంపచోడవరం: రంపచోడవరంలోని రామకృష్ణ మిషన్ ఆస్పత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్టు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. వైద్య శిబిరంలో వైద్యులు టీవీ సుబ్బారావు, దాసరి ఉమా మహేష్,, రాయుడు శ్రీనివాస్, ఎస్.సంపత్ కుమార్‌లు పాల్గొని 150 మంది వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వారికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. పరిజ్ఞేయనందజీ మహారాజ్ మాట్లాడుతూ రామకృష్ణ మిషన్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలను ఏజెన్సీ వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్యాంప్ కో– ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. రోగులకు, సహాయకులకు అన్నదానం నిర్వహించారు.

ఘనంగా త్రిపురాంతక స్వామి పెళ్లిరాట


పెళ్లిరాట వేస్తున్న భక్తులు

కోటవురట్ల: స్థానిక పురాతన శివాలయ ఆవరణలోని సర్వమంగళాంబ సమేత త్రిపురాంతక స్వామి వారి పెళ్లిరాట ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 23న స్వామి వార్ల 108వ కల్యాణోత్సవం జరగనుంది. దీనిలో భాగంగా పెళ్లిరాట ఉత్సవాన్ని నిర్వహించారు. సంప్రదాయంగా నేరేడు కొమ్మను తెచ్చి పసుపు రాసి, కుంకుమ బొట్లు పెట్టి వేదమంత్రాల నడుమ పూజలు జరిపి, పెళ్లిరాట నిలిపారు. ఆలయ అర్చకులు వి.బాబ్జి, వి.శంకరంల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

అనకాపల్లి:మండలంలో శంకరం పంచాయతీ బొజ్జన్నకొండ వద్ద పట్టణంలోని జీవీఎంసీ చిన్నహైస్కూల్‌కు చెందిన 1993–94 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల ప్రతినిధి పెంటకోట పూర్ణచంద్రరావు మాట్లాడుతూ 29 సంవత్సరాల తరువాత కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గల్ఫ్, అబుదాబి నుంచి పూర్వవిద్యార్థులు వచ్చారు. ఇకపై ఏటా ఫిబ్రవరి 2వ ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించేందుకు తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు కాండ్రేగుల రామలింగేశ్వరరావు, జగన్నాథరావు, బత్తుల నూకేష్, ఆళ్ల శివాజీ, అల్లెపు కాశన్న, షేక్‌చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి


ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ అరుణ్‌కిరణ్

చింతపల్లిరూరల్: మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు తలెత్తకుండా ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎస్‌ఐ అరుణ్‌కిరణ్ అన్నారు. వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులతో ఆయన ఆదివారం సమావేశం నిర్వహించారు.ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ఫలితాల వరకు అందరు సమన్వయం పాటించాలని సూచించారు. జూన్ 4తేది వరకు ముందస్తు సమాచారం లేకుండా రాజకీయ సమావేశాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

ఎన్నికల కోడ్ అమలులో ఉంది

రంపచోడవరం: ఎన్నికల కోడ్, సెక్షన్ 144, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ఏ ప్రాంతంలో కూడా జనం గుమిగూడి ఉండవద్దని రంపచోడవరం ఎస్‌ఐ ఎం.మోహన్‌కుమార్ తెలిపారు. ముందస్తు అనుమతులు లేకుండా బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించొద్దన్నారు. ప్రభుత్వ మద్యం షాపుల వద్ద మద్యం సేవించడం నేరమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానంగా తిరిగినా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మలేరియా నివారణ దోమలమందు పిచికారీ పనులను పర్యవేక్షిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

గూడెంకొత్తవీధి: ముందు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మలేరియా, డయేరియా వంటి వ్యాధులను నివారించవచ్చని గూడెంకొత్తవీధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ వినయ్, అచ్యుత్‌లు అన్నారు. సీలేరు మలేరియా సబ్ యూనిట్ అధికారి కన్నబాబు ఆధ్వర్యంలో ఆదివారం రింతాడ సచివాలయం పరిధిలోని అసరాడ గ్రామంలో మలేరియా నిర్మూలనకు సంబంధించి దోమల నివారణ మందు పిచికారీ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా జ్వరాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యాధికారులు వివరించారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రింతాడ హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్‌ఎం భాగ్యలక్ష్మి, సచివాలయ ఏఎన్‌ఎం కుమారి, ఆశ కార్యకర్తలు దీనకుమారి, రాజేశ్వరి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా క్రికెట్ పోటీలు

పెదబయలు: పెదబయలు మోదకొండమ్మ తల్లి జాతర ఉత్సవాల సందర్భంగా స్థానిక క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. సీతగుంట గ్రామ సమీపంలోని మత్స్యగెడ్డ అనుకుని ఉన్న మైదానంలో పోటీలు జరుగుతున్నాయి. పోటీల్లో 32 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం ఉదయం 12 ఓవర్ల మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ముంచంగిపుట్టు జట్టు 82 పరుగులు చేసింది. 87 పరుగుల విజయ లక్ష్యంతో దిగిన పెదబయలు క్రికెట్ లవర్స్ జట్టు 11 ఓవర్లలోనే 2 వికెట్లు నష్టపోయి విజయం సాధించింది.ఈ టోర్నీలో పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల నుంచి కరోనా, ఇతర అనారోగ్య సమస్యలతో మృతి చెందిన 23 మంది క్రీడాకారులను స్మరిస్తూ క్రికెటర్స్ మెమోరియల్ టోర్నమెంట్‌గా నామకరణం చేశామని నిర్వాహకుడు గండేరు జీవన్‌కుమార్ తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.20 వేలు నగదు బహుమతి ట్రోఫీ, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేలు నగదు బహుమతి, ట్రోఫీ అందించనున్నట్టు చెప్పారు. సీతగుంట క్రికెట్ ల వర్స్ టీం టోర్నీకి అన్ని సహకారం అందించినట్టు తెలిపారు.